# సత్యప్రకాశం అను మరిడీమహాలక్ష్మికథ లోక గోవులొస్తున్నాయి జాగ్రత్త!

## రాచకొండ విశ్వనాథశాస్త్రి

నాపేరు కిరీటిరావు. నేను బెంగాల్లో సబ్‌డివిజనల్ మేజిస్ట్రేటుగా ఉండేవాణ్ని. అక్కడి ఓవూళ్ళో ఓసారి అల్లర్లు జరిగేయి. పోలీసులమీద అలగా జనం ఆ అల్లరిలో రాళ్ళు విసిరేరు. పాపం, చాలామందిపోలీసులకి దెబ్బలు తగిలేయి. వెంటనే నేను, తుపాకులు కాల్చమని పోలీసువారికి ఆర్డరు జారీ చేసేను. నా ఆర్డరుప్రకారం వారు కాల్పులు జరిపేరు. అయిదువేల మందిలో కొద్దిమంది గాయపడ్డారు, ఓ పదిమంది కాబోలు అక్కడికక్కడ చచ్చిపోయేరు. అల్లరిమట్టుకు అప్పటికి అణిగింది. కాని, ఆ కాల్పులగురించి, అటుతర్వాత, కొంతమంది తుంటర్లు మరికొన్ని అల్లర్లు లేవదీసేరు. వాళ్ని కూడా అణిచిపారేస్తే ఏ గొడవా లేక పోను. కాని అల్లర్లకి భయపడిపోయి లొంగిపోయిన నా పై అధికార్లు నామీద అంక్వయిరీ జరిపించేరు. నేను 'చెడ్డగా' ప్రవర్తించేనని అంక్వయిరీ కమీషన్ వారు ఖచ్చితంగా తేల్చినప్పటికీ ప్రభువులు నన్ను ట్రాన్స్‌ఫర్ చేసి నాకు రెండేళ్ళపాటు ప్రమోషన్ రాకుండా ఉండేందుకు ఉత్తర్వు జారీచేసేరు.

అందుమీదట, ఆ ఉత్తర్వు చెల్లనేరదంటూ నేను గౌ॥ హైకోర్టువారికి రిట్ పిటీషను దాఖలు చేసుకొని, అందులో నెగ్గుకొని, పంతానికి కొన్నాళ్ళమాత్రం ఉద్యోగం చేసి ఆతరవాత అర్లీగా రిటైరయిపోయేను. నా గౌరవం నిలబడ్డాక నాకు మరింక ఉద్యోగం అక్కరలేదనిపించింది.

నాకిప్పుడు ఒకటోరకం వ్యాపారాల్లో మంచిమంచి వాటాలున్నాయి. నేనిప్పుడు మూడుకంపెనీల్లో డైరెక్టర్‌గా ఉన్నాను. ఓ కంపెనీకి ఛేర్మన్ అఫ్ బోర్డ్ అఫ్ డైరెక్టర్స్‌గా ఉన్నాను. నా కుమారుడు ఐ. ఏ. ఎస్ పాసయి, సెంట్రల్ సెక్రెటేరియట్‌లో అసిస్టెంట్ సెక్రెటరిగా ఉన్నాడు. నా కుమార్తెకి పెళ్ళిచేసేసేను. ఆమె పెనిమిటి ఏరోఎంజిన్ ఫ్యాక్టరీలో ఎంజినీర్‌గా ఉన్నాడు. మెషీన్‌టూల్స్ ఫ్యాక్టరీకి ఫారిన్ కొలా

బరేషన్ కోసం నేను ప్రయత్నం చేస్తున్నాను. అది వచ్చేక కంపెనీ ఫ్లోట్ అయేక, నా అల్లుడు దానికి మానేజింగ్ డైరెక్టర్‌గా వస్తాడు. నా కుమారుడు సెంటర్లో 'కాంటాక్ట్స్' సంపాదించేక, అంటే అవసరమైన పరిచయాలు సంపాదించేక, ఉద్యోగం రిజైన్ చేసి నా బిజినెస్‌లోకి వచ్చేస్తాడు.


పార్లమెంటులో నా ప్రతినిధులిప్పుడు ఇద్దరున్నారు. అసెంబ్లీలో నా చేలాలు అరుగురు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. సెంటర్లో ఓ మంత్రి నాకు చుట్టం. మరో ఇద్దరు నాకు స్నేహితులు. మిగతావారితో నాకు పరిచయం ఉంది. మరింక స్టేట్‌లో మంత్రులు నేను పిలిస్తే నిద్రలోకూడా పలుకుతారు.

చెప్పే దేమిటంటే: ఉద్యోగం. మానేసి నేను నష్టపోలేదు. కోటమీది పెద్దల బావుటాల్లో నా బావుటాకూడా నిలబడి ఎగురుతోంది. ఉద్యోగం మానేసినందుకు నేను విచారించడంలేదు.

కాని, ఆనాడు అధికార్లు నామీద అంక్వయిరీ జరిపించడం గురించి మాత్రం నేను తరచుగా ఆలోచించి బాధపడుతూంటాను. వెధవల బెదిరింపులకి ప్రభువులు లొంగిపోవడం చాలా అన్యాయమూ అసందర్భమూ అని నాకు అనిపిస్తూంటున్నది. ఎవరుమంచి ఎవరుచెడ్డ అని ఆలోచిస్తూ తర్కిస్తూ ప్రభువులు చీకట్లో గింజులాడుకోడంకంటె, ఎవరికి ఏది మంచి, ఎవరికి ఏదిచెడ్డ అని తర్కించినట్లయితే వారు వెంటనే వెలుగులోకి వస్తారని నేను తలుస్తూంటాను. అలగాజనం ఆనాడు చేసిన అల్లరికి భయపడిపోయిన పాలకులు తమ కర్తవ్యం మర్చిపోయి ప్రవర్తించేరని నేను ఖచ్చితంగా చెప్పగలను. అలగాజనం మంచివారే కావచ్చును. కాని వారిమంచి మనకికూడా మంచిదగునా కాదా అనే విషయం తేల్చుకోకుండా వ్యవహరించినట్లయితే మనం దేశాన్ని తప్పుడుతోవలు తొక్కించినవాళ్ళం అవుతామని నేను అభిప్రాయపడుతూంటాను; దేశక్షేమం గురించి నేను చాలాభయపడుతూంటాను. ప్రస్తుత పరిస్థితులు చూస్తూంటే నాకు ఆందోళన కలుగుతుంది. ఇటువంటి సమయంలో మంచిచెడ్డల గురించి పెద్దవారికి అసలైన తెలివితేట లుండడం చాలా అవసరమని నా నమ్మకం.

అందుమీదట —

నా చిన్ననాడు మా రాజయోగి పెదనాయనగారి ఆశ్రమంలో జరిగిన సంఘటనొకదానిగురించి పెద్దలందరికీ (అందులోనూ ముఖ్యంగా పాలకులకీ) చెప్తే మంచిదనీ, చెప్పడం చాలా అవసరమనీ నాకు తోచింది. ఆనాడు ఆ ఆశ్రమంలో నేను పూర్తిగా కన్నువిప్పేను; చక్కటి గుణపాఠం నేర్చుకున్నాను. ఆ విషయం అంతా మనవాళ్ళు తప్పక తెలుసుకోవలసి ఉన్నదని నా అభిప్రాయం. అందు




చేత, అదంతా మనవాళ్ళకి వివరంగా చెప్తున్నాను.

* * *

నేను పంధొమ్మిదివందల పదిహేడో సంవత్సరం (1917) జనవరి ఫస్టుతారీఖు నాడు జన్మించేను. సర్ శ్యామసుందర రావుగారు నాకు మాతామహులు. మా నాయనగారి పేరు పాండురంగారావు. ఆయన డిప్యూటీ కలెక్టర్‌గా ఉండేవారు. వారికి నేనొక్కణ్ణే పుత్రసంతానం చాలాకాలంవరకూ _ కాని, నా పదిహేడో యేట నాకు తమ్ముడు వచ్చేడు. వచ్చేడు కానీ, వేగిరం వెళ్ళిపోయేడు. వాని ప్రసక్తి ఈ వృత్తాంతంలో ఏమీలేదు.

ఒకటో నెల ఒకటోతారీఖునాడు (ఇంగ్లీషుగాదినాడు) నేను పుట్టడం గురించి నా చిన్నతనంలో నేను చాలా గర్విస్తూండేవాణ్ని. అది నాకు చాలా గొప్పగా ఉండేది. మనం పుట్టడం మన చేతుల్లో లేదంటే అది, మరి, భగవంతుడి చేతుల్లో ఉన్నదన్నమాటే కదా! భగవంతుడు నన్ను సరిగ్గా సంవత్సరాది నాడే పుట్టించడంలో ఏదో ప్రత్యేకత ఉన్నదని నేను నమ్ముతూంటాను.

అయితే,

మా మాతామహులవారి ఇంట్లో తోట మాలీవాడికొడుకుకూడా నేను జన్మించిన నాడే పుట్టేడు! అది నాకు చాలా కష్టంగా ఉండేది. అందుగురించి తల్చుకున్నప్పు డల్లా ముల్లుగుచ్చుకున్నట్టు నా మనసు

చివుక్కుమనేది. నా ఎక్కువతనంలో కొంతభాగం వాడు పంచుకుపోయినట్టుగా నాకు ఒకొక్కప్పుడు అనిపించేది. వాడి తక్కువతనం నాకొ్కంచెం అంటుకున్నట్టుగా ఇంకోప్పుడు అనిపించేది. ఎలా అనిపించినప్పటికీ నాకు చాలా చిరాగ్గా ఉండేది. వాడి తలిదండ్రులు మాత్రం, "శినబాబు పుట్టిన్నాడే మా అయ్యకూడా పుట్టాడు!" అని చాలా గర్వంగానూ సంతోషంగానే కాకుండా చాలా వినయముగాకూడా చెప్పుకొనేవారు. నా ఎక్కువతనం వాళ్లు బేషరతుగా అంగీకరించినందువల్ల, వాళ్ళూ వాళ్ళపిల్లడూ చేసినతప్పు నేను అప్పుడప్పుడు క్షమించగలిగేవాణ్ని; కాని, తోటమాలీకొడుకు నాతో ఏదోరకంగా ఆపాటి సమానత్వం అయినా సంపాదించగల్గడం తరచు నేను భరించలేక పోతూండేవాణ్ని.

నా పదోయేట అనుకుంటాను: మా అమ్మని నే నొక్కసారి, "'మ్మా! నేను పుట్టిన్నాడే వాడుకూడా ఎలా పుట్టేడమ్మా?" అని దీనంగా అడిగేను. నేను వేసిన ప్రశ్నలో నా క్యూరియాసిటీకంటె (వాడు నాతో సమానం అయిపోతాడేమో ననే భయంవల్ల కలిగిన) నా బాధ ఎక్కువ ధ్వనించి ఉండవచ్చు. మా అమ్మ నా అసలుభావం టక్కున గ్రహించి, "అదేం ఫరవాలేదు శ్యాం! అంతమాత్రంచేత వాడూ నీతో సమానం అవగలడా? అవలేడు! ఆవేళ నీతోపాటు వాడేకాదు, చాలా జంతువులూ పక్షులూకూడా పుట్టుండొచ్చు. అంతమాత్రంచేత అవ న్నీ నీతో సమానం అవుతాయా?!'' అంది. ఆ ఆర్గ్యుమెంటు నాకు బాగా అర్థం అయింది. ఎంతో నచ్చింది. ఆ తోటమాలీకొడుకు నాతో సమానం కానందుకు 'హమ్మయ్య!' అని నిట్టూర్చేన్నేను. (నా పూర్తిపేరు శ్యామసుందర కిరీటిరావు: మొదటిభాగం మా మాతామహులది, రెండోభాగం నా పితామహులది. మా అమ్మమాత్రం నన్ను 'శ్యాం' అనే పిల్చేది.)

మా మాతామహులవారి తోటమాలీ వాడి కొడుకు పేరు గోపాలదాసుడు. (టూకీగా గో. దాసుడు.) మా రాజయోగిపెదనాయనగారి ఆశ్రమానికి వెళ్ళినప్పుడు వాడుకూడా నాతో అక్కడికి వచ్చేడు.

మా నాయనగారు డిప్యూటీకలెక్టర్‌గా ఉండేవారు కదా. ఉద్యోగరీత్యా వారు అక్కడకీ ఇక్కడకీ బదిలీలమీద తిరుగుతూండడంవల్ల, నేనూ మా అమ్మా మా తాతగారి ఇంట్లో - అంటే మా మాతామహులు సర్ శ్యాంసుందరరావుగారింట్లోనే - ఉంటూఉండేవాళ్ళం. మా మాతామహులు నా అయిదోయేట కాలం చేసేరు. మా మాతామహి మాత్రం నా ఇరవయ్యోయేట పోయేరు. ఆవిడ ముసలి గ్రీక్ స్టాచ్యూలా అందులోనూ మా ర్బుల్ స్టాచ్యూలా ఉండడం నాకు ఎంతో బాగా

గుర్తుంది. ఆవిడకి నేనంటే పంచ ప్రాణాలూను.

మా రాజయోగిపెదనాయనగారు మా మతామహులవారిఇంటికి తరచు వస్తూండేవారు. నాకు కొంచెంజ్ఞానం వచ్చేప్పైంకి ఆయన కప్పుడే అరవయ్యేళ్ళు దాటి ఉండవచ్చు. ఆరడుగుల పొడవుండేవారాయన. ఎత్తుకి తగ్గట్టుగా లావుగాకూడా ఉండేవారు. నిల్చుంటే, ఆయన రోమన్ స్టాచ్యూలా ఉండేవారు. కూర్చుంటే, ఆయన రోమన్‌స్టాచ్యూ కూర్చున్నట్టుండేవారు. ఎర్రగా దుంపలా కాకుండా ఎర్రగా ఆపిల్‌పండులా ఉండేవారాయన. రాజవర్చస్సో, బ్రహ్మతేజస్సో అదేదో చెప్పలేం కాని ఆయన తళతళమని వెలుగుతూండేవారు. ఆయన పండుగెడ్డం వెలిగించిన వెండికిరణాల సమూహంలా ఉండేది. ఆయనకి ముగ్గురుభార్యలవల్ల మూడు జాగీర్లొచ్చేయి. ఆయనకి ఓ జమీన్దారీ ఉండేది. వారి ముగ్గురుభార్యలూ కూడా నిస్సంతుగా కాలం చేసేరు. అరవయ్యేళ్ళవరకూ మా పెదనాయగారు మంచి భోగిగా ఉండి, ఆ తరవాత అతిమంచి యోగిగా మారిపోయేరు. ఆయన భోగిగా ఉండడం మాఅందరికీ గొప్పగా ఉండేది. ఆయన యోగిగా మారడంకూడా మా అందరికీ చాలా గొప్పగా ఉండేది.



మా రాజయోగిపెదనాయనగారు నన్ను చాలాచాలా అభిమానంగా చూసుకొనేవారు, ఆ రోజుల్లో నేను ఆడామగా అందరికీకూడా ముద్దొస్తూ చాలా ఛామింగ్‌గా ఉండేవాణ్ననుకోండి; అందులో సందేహంలేదు. కాని, వారికి, అంటే మా రా. యో. పె. నా. గారికి (అలా వారిని రిఫర్ చెయ్యడం ఇర్రివరెంట్‌గా ఉందనుకుంటాను) మా రాజయోగిపెదనాయనగారికి నన్ను చూస్తే ప్రత్యేకంగా ఇష్టం ఉండేది. కొడుకంటూ ఉంటే తనకి నాలాంటి కొడుకు ఉండాలని ఆయన సరదా పడేవారని నేననుకుంటాను.

(ఈ వృత్తాంతం అంతా మనవాళ్ళకే కాబట్టి అరమరికలు లేకుండా అతి

(ఫ్రాంక్‌గా చెప్పేస్తున్నా న్నేను.) నన్ను ఎవరైనా అతిగొప్పవాళ్లు పెంచుకుంటే బావుండునని నాకు చిన్నప్పుడు బలమైన కోరిక ఒక టుండేది. మా మేనమామ లిరువురూ అకస్మాత్తుగా చచ్చిపోతే, మా మాతామహి నన్ను పెంచుకొంటే, 'ఏంత బావుండునో కదా! అప్పుడు నేను సర్‌శ్యాంగారి మనవణ్ణి కాకుండా కొడుకునే అయిపోతానుకదా!' అని నాకు అనిపిస్తూండేది. నన్ను ఏదో టీ పార్టీలో వైస్రాయిగారి భార్యో లేక ఏ బ్రిటిష్‌రాణీ చెల్లెలో ఎవరో చూసి నా అందం చూసి మురిసిపోయినట్టూ, నన్ను తన కొడుగ్గా పెంచుకున్నట్టూ ఊహించు కొని నేను ఒక్కోప్పుడు అలా రోజు రోజుల్లా గడిపేసేవాణ్ని. అలా జరగ డానికి అవకాశం లేదని తెలిసినప్పటికీ, కలలుమాత్రం హాయిగా కనేస్తూండే వాణ్ని.

అయితే —

మా రాజయోగి పెదనాయనగారు నన్ను పెంచుకుంటారేమోనని మా అంద రికీ చాలా ఆశగా ఉండేది. ఆ ఆశ ఆయనే మాలో కల్పించేరని కూడా నేను చెప్పవలసి ఉంటుంది. అయితే, ఆయన నాకు స్వంత పెదనాయన కాక పోవడం వల్ల అనుకుంటాను, ఆయన చాలాకాలం తర్జన భర్జన చేస్తూ ఏ నిర్ధా రణకీ రాలేకపోయేరు. నిర్ధారణకి వచ్చే సరికి సమయం మించిపోయి ఆయన కాలం చేసేరు. ఆయనమరణం నా జీవి తంలోనే కాకుండా మా కుటుంబానికే పెద్ద కెలామిటీ అని నేను చెప్పవలసి ఉంది. సింహాసనంమీద కూర్చోబో తూంటే అడుగునించి ఆసనం ఎవరో లాగేస్తే దుబ్బున చతికిలబడి నట్టు మేమంతా డేజ్ అయి పోయి అలా ఉండిపోయేం. అయితే మేం ఊరుకోలేదనుకోండి. ఆయన మరి నాలుగురోజులు బతికిఉన్నట్లయితే నన్ను తప్పకుండా ఏలానూ పెంచుకొనే వారే కాబట్టి, ఆయన నన్ను నిజంగా పెంచుకున్నారన్చెప్పి ఆయన ఆస్తికోసం మేం దావా వేసేం. ఆర్భాటంచేసి దత్తత చేసుకొంటే బంధువులతో విరోధాలొస్తా యని భయపడి ఆయన నన్ను క్వయట్‌గా చడిచప్పుళ్ళేకుండా దత్తత చేసుకున్నా రని మేం వాదించేం. మా తరపున సాక్ష్యంకూడా చాలా కట్టుదిట్టంగా వచ్చింది. మా కేసుకి ఢోకాలేదనే మేం అంతా అనుకున్నాం. కాని, అప్పటి సబ్ జడ్జీ ఇంగ్లీషువాడు కాకపోవడంవల్ల మా కేసు దెబ్బతింది. ఆస్తులన్నీ అవ తల పార్టీవారి స్వాధీనంలో ఉండడం వల్లా, మేం అప్పీలు చేసినప్పటికీ లాభం లేకపోయింది. ఆ పార్టీవారు గవర్నర్ని ఇన్‌ఫ్లూయన్స్ చెయ్యగలి గేరు. వాళ్ళసైడు అడ్వకేట్‌జనరల్ సర్ రామశేషన్ నిలబడి గట్టిగా పని చేసేడు. మేం ది ఫేమస్‌బారెట్లా సర్



కాకాసాహెబ్‌ని మా సైడు నిలబెట్టేం. కాని, ఐసీయస్ బ్రిటిష్‌జడ్జీని సర్ రామ శేషన్ సాంబార్తో ఇడ్లీ నంచుకుతిన్నట్టు ఆర్గ్యుమెంటుతో నంచేసుకున్నాడు. సన్యసించినవాడు పెంచుకోడానికి వీల్లేదన్న పాయింటుమీద మా అప్పీలు పోయింది. మా రాజయోగి పెదనాయన దొంగ సన్యాసే కాని నిజంగా సన్యసించ లేదని మేం వాదించేం; కాని, మా వాదన నిలవలేదు. "రాజయోగి గారు దొంగసన్యాసా? లేక, సన్యసించిన దొంగా?" అని ప్రశ్నించి "ఆయన సన్యసించిన తరువాత దొంగపనులు చేసేరు; కాని, సన్యసించడంలో దొంగ తనం చేయలేదు!" అని సమాధానం చెప్తూ తీర్పు చెప్పేరు. గౌ॥ హైకోర్టు వారు. సన్యాసులుకూడా పెంచుకోవచ్చని శాస్త్రాలే కాకుండా సింగిల్‌జడ్జీ తీర్పులు కూడా మా పక్షం ఉన్నాయని సర్ కాకా సాహెబ్ అన్నారు. ప్రీవీ కౌన్సిల్‌కి వెళ్ళమనికూడా వారు సలహా ఇచ్చేరు. ప్రీవీకౌన్సిల్‌కి వెళ్తే మేం తప్పక నెగ్గేవారమే! కాని, అప్పటికి కాళ్లుచాలా పీకడం చేత మా నాయనగారు అంత దూరం వెళ్ళడానికి వెనకతీసేరు.

అయితే, మా రాజయోగి పెదనాయన గారు చనిపోయేక, వారి ఆస్తిగురించి మేం తెచ్చిన కేసులో కొన్ని అపనిందలు మా వాళ్లు వేసినప్పటికీ, ఆయన మాత్రం నిజంగా చాలా గ్రేట్‌మాన్

అని నేను గట్టిగా చెప్పవలసి ఉంది. అంతటి మహానుభావులైనవారు నాయందు ఎంతో దయతో నన్ను చెన్నపట్నంలోని వారి భవనానికి తీసుకువెళ్ళి ఎన్నిసార్లు తనపక్కన సోఫాలో కూర్చోబెట్టుకున్నారో అని లెఖ్ఖ వేసుకున్నప్పుడల్లా నేను ఆనందబాష్పాలు రాలుస్తూంటాను.


చెన్నపట్నంలో వారి ఇంటికి నేను చాలాసార్లు వెళ్ళేను కాని వారి జమీగ్రామం అయినట్టి సువర్ణసుందరపురం మాత్రం నేను ఒక్కసారే వెళ్ళేను. అక్కడికి రమ్మని వారు నన్ను చాలా కాలం [illegible] పిలవలేదు. నన్ను వారి జమీగ్రామానికి పంపించమని వారు మా మాతామహిని కోరిననాడు మా ఇంట్లో అంతా ఉత్సాహభరితులైపోయేరు. ఆయన నన్ను దత్తత చేసుకొందికి నిశ్చయించుకున్నారని ఆ రోజునే మేం తెలుసుకోగలిగేం. మా అమ్మా మా మాతామహీ కలసి దగ్గిరుండి ఆ రోజున నాకు దిష్టి తీయించేరు. నాకు అప్పటికి పదమూడేళ్లు వెళ్ళేయి.

సంవత్సరం: పంధొమ్మిదివందల ముప్ఫయ్యో సంవత్సరం. సెలవులు: దసరా సెలవులు. నావయసు: పధ్నాలుగేళ్ళ వయసు. నా రూపు: జాంపండు లాంటి రూపు.

మా నాయనగారు అప్పుడు ఊళ్ళోనే ఉన్నారు. ఆయన స్వయంగా స్టేషన్‌కి వచ్చి నన్ను పాసెంజర్ ఎక్కించేరు. గోపాలదాసుగాడు సర్వెంట్స్ కంపార్ట్‌మెంట్‌లో కూర్చున్నాడు. నాకు సాయంగానూ తైనాతీగానూ ఉండడానికి వాణ్ని మా మాతామహిగారు నాతో ప్రత్యేకంగా పంపించేరు. ఆ ప్రయాణంలో వాడి సంతోషం ఏమిటో నేను చెప్పలేను. స్టేషన్ స్టేషన్‌లోనూ వాడు నా ఫస్ట్‌క్లాస్ బోగీ దగ్గిరకి వచ్చి గెంతుతూండేవాడు. సూది ముక్కుతో పెద్ద కళ్ళతో ఏర్రగా సన్నంగా షోగ్గానే ఉండేవాడు వాడు. నా నౌఖరీవాడు ఏడుస్తూ మురికోడుతూ ఉండక, చలాకీగా చక్కగా ఉండడం నాకు సరదా వేసింది. వాణ్ని చూసి నేను — కొండవాళ్ళనీ కోదువాళ్ళనీ కాకుండా సూర్యవంశపు రసపుత్రవీరుల్ని కమాండ్ చేసే బ్రిటిష్‌రాజులాగ — ఎంతో గర్వించేను.

సాయంకాలం ఆరుగంటలకి కాబోలు మానాయనగారు నన్ను ట్రెయిన్ ఎక్కించేరు. మెయిలైతే వేగిరం వెళ్లును. స్టేషన్ చిన్నదైనప్పటికీ మా రాజయోగి పెదనాయనగారు తన పలుకుబడి ఉపయోగించి మెయిల్ ట్రెయిన్ని కూడా అక్కడ ఆపించేవారు, కాని అది అక్కడకి రాత్రి వేళ చేరుకొంటుంది. పాసెంజర్ అయితే పొద్దున్నే వెళ్తుంది. అందుచేత నేను పాసెంజర్లో బయల్దేరేను.

రాత్రి పదిగంటలయింది. నేను



భోజనం చేసి, అప్పర్ బర్త్ ఎక్కి, మా రాజయోగి పెదనాయనగారు నన్ను దత్తత చేసికోడం గురించి ఉత్సాహంగా ఎంతోసేపు ఆలోచించి అలిసిపోయి అలా ఎప్పుడు నిద్రపోయేనో నిద్ర పోయేను.

మా రాజయోగిపెదనాయన గురించి చాలా చెప్పేను కాని, ఒక విషయం మాత్రం ఇంతవరకూ చెప్పలేదు.

మనలో మాట.

నూటికో లేక కోటికో ఉండవచ్చు నేమోగాని మనలో రాజద్రోహులంటూ సాధారణంగా ఉండరు. ఆ రోజుల్లో మనవాళ్ళందరికీ మన పాలకులైన బ్రిటిష్‌వారంటే ఎంతటి భక్తి విశ్వాసా లుండేవో మీ అందరికీ తెలియని విషయం కాదు. నా చిన్నతనంలో 'నేను హిస్టరీ చదువుతున్నప్పుడల్లా బ్రిటిష్ వారి శత్రువులగురించి బ్రిటిష్‌వారికంటె ఎక్కువ మండిపడుతూండేవాణ్ణి. నెపో లియన్ నా టైంలో ఉండాలనీ, వాణ్ని నేను ఓడించాలనీ అప్పుడు నన్ను జార్జిప్రభువు మెచ్చుకోవాలనీ నాకు ఎంతో ఇదిగా ఉండేది. మా కుటుంబాల్లో అందరూకూడా ఆ విధంగానే చాలా మంచి రాజభక్తులుగా ఉండేవారు. మా నాయనగారొక్కరికే వెయ్యేనుగుల రాజభక్తి ఉండేదంటే మొత్తం మా భక్తిబరువు ఎంతుండేదో ఊహించు కోండి మరి! ఆ రోజుల్లో రాజభక్తి విష యంలో ఇప్పట్లో దేశభక్తి విషయంలో లాగే మనవాళ్ళంతా చాలా దిట్టంగా భీమభక్తితో ఉండేవారు.

కాని -

మా రా జ యో గి పెదనాయనగారు మాత్రం దారితప్పేరని చెప్పడానికి కొంత చింతిస్తున్నా న్నేను. జాతకంలో ప్లానెటరీ పొజిషను ఏం దెబ్బతిందో కాని ఆయన, ఉన్నట్టుండి, గవర్నమెంటుకి వ్యతిరేకంగా స్వాతంత్ర్య సమరంలోకి దిగిపోయేరు. అదృష్టవశాత్తూ ఆ సమరము చాలా మర్యాదగా శాంతియుతంగా జరిగింది కాని, "మరోలా జరిగితే ఏమై యుండునో కదా ?!", అని నాకు అప్పుడప్పుడు అనిపిస్తూంటుంది. (అది శాంతియుతంగా జరక్కపోతే మా రాజయోగి పెదనాయనగారు అందులోకి దిగనే దిక్కపోదురనుకోండి! అందులో సందేహం లేదు.)

ఖద్దరు బురదలోకి మారాజయోగి పెదనాయనగారు దిగేరని తెలిసిననాడు మావాళ్ళంతా విస్తుపోయి షాక్ అయిపోయి, ఇంటిపెద్దకి లెప్రసీ వస్తే భయపడిపోయినట్టు భయపడిపోడం నాకు బాగాగుర్తుంది. శ్రీ కృష్ణుడు అకస్మాత్తుగా రాత్రికిరాత్రి వెళ్ళి దుర్యోధనుడితో చేరిపోతే ధర్మరాజు బాధపడట్టు మావాళ్ళంతా బాధపడ్డారు. నా దత్తతగురించికూడా నాకూ మావాళ్ళకీ చాలా బెంగలొచ్చేయి. కాని ఆ బెంగలు నీటిబుంగల్లా వెంటనే మాయమయేయి.


ఓసారి మా రాజయోగిపెదనాయనగారు మా మాతామహులవారి ఇంటికి వచ్చినప్పుడు, మా నాయనగారుకూడా సెలవుమీద అప్పుడు అక్కడ ఉండడం తటస్థించింది. రాజయోగివారు ద్రోహిగా మారేరని నాకు అప్పటికి తెలియడంచేత వార్ని చూసి నేను బెదిరేను. ద్రోహుల్ని చూసి భక్తులు బెదరడం సహజం కదా!

కాని,

ఆ రోజున మా నాయనగారూ మా రాజయోగి పెదనాయనగారూ కూర్చొని, ఆత్మబంధువులుగా మాట్లాడుకున్న తీరు చూస్తే నా బెదురంతా పటాపంచలైపోయింది. రాజయోగి పెదనాయనగారు ద్రోహులపార్టీలో చేరినప్పటికీ ఆయన మనవారేకదా అని తెలిసిపోవడంతో నా మనసంతా తేలికపడింది, ఎంతో నిర్మలమయింది.

"ఉద్యోగం మానేసి నువ్వుకూడా మాలో చేరిపోకూడదా? స్వతంత్రంవస్తే మనకి లాభలేఁ కాని నష్టం ఏవీఁ ఉండదు. ఈ లోపున నీకు మంచిపేరుకూడా వస్తుందన్నారు రాజయోగిపెదనాయనగారు.

"మీరంతా శ్రమపడుతున్నారు కదా! నేనుకూడా ఎందుకండీ? స్వతంత్రం వచ్చేకంటారా? అప్పుడు మేం మీతోనే ఉంటాంకాని మీకు ఎదురు తిరగంకదా! అందాకా మీ రటుండండి, నే నిటుంటాను; మరేం ఫరవాలేదు. అది మన ఉభయులకీ శ్రేయస్కరం!", అని నాయనగారు నవ్వుతూ అన్నారు.



ఆ మాటల అర్థం నే నప్పుడు పూర్తిగా గ్రహించలేక పోయినప్పటికీ వాటి సారాంశం మాత్రం నాకు ఇంచూటిప్‌గా బోధపడింది. మా నాయనగారూ మా రాజయోగిపెదనాయనగారూ ఆ విధంగా ఒకే చెట్టుకి రెండు బంగారు కొమ్మల్లా ఉండడంచూసి నేను ఎంతగానో సంతోషించేను.

మా రాజయోగిపెదనాయనగారి కున్నంతడబ్బు మాలో ఎవరికీ ఉండేది కాదు. స్వాతంత్ర్య సమరంలోకి దిగిపోయి, 'రాజద్రోహి'గా మారిపోయినప్పటికీ ఆయన డబ్బుకాని హోదాకాని ఆయనకుండే గౌరవంకాని ఏ మాత్రం తరగలేదు. ఆయన్ని ఆనాటి మన బ్రిటిష్ ప్రభువులు జెయిల్లో వేయించవలసివచ్చినప్పుడు ఆయన్ని చాలా మర్యాదాగా చూడవలసిందిగా పోలీసువారికి స్పెషల్‌గా తాకీదు లిచ్చేరు. పోలీసువారు ఆయన్ని ఎస్పీసింటె ఎక్కువగా చూసుకున్నారంటే అందులో మరి ఆశ్చర్యం ఏముంది?: ఆయన్ని జెయిల్లో వేసినపుడు మా నాయనగారి స్వయంమేనత్తకొడుకే జైలుసూపరెంటెండెంట్‌గా వుండేవారు. ఆయన మా రాజయోగిపెదనాయనగారికి జెయిలు జెయి లంతచేతా సేవ చేయించేరట. జరిగితే అలా జరగాలి దర్జా! సత్యాగ్రహం పేరు చెప్పుకొని ఆరోజుల్లో బైరాగ్గాళ్ళు చాలామంది వెళ్ళేరు జెయిలుకి. వాళ్ళకీ మనలాంటివాళ్ళకీ ఉండే

తేడా మా రాజయోగిపెదనాయనగారి జెయిలు జీవితంవల్ల స్పష్టపడ్డం లేదా?!

మరొక ప్రత్యేకత:

మానవుల్ని ఏ విధంగాఅయితే ప్రేమించేవారో అదేవిధంగా చీమల్నీ దోమల్నీకూడా ప్రేమించగలిగేవారు మా రాజయోగిపెదనాయనగారు! చచ్చిన చిలకని చూసి ఆయన ఎంతగా కరుణతో కరిగిపోయేవారో, అంతకంటె హెచ్చుగా, దాన్ని చంపిన పిల్లిని చూసి ఆయన జాలితో నీరుకారిపోయేవారు.

మరింక, శత్రువుల్ని (అంటే తన 'సమాన శత్రువుల్ని') ప్రేమించడంలో మా రాజయోగిపెదనాయనగార్ని మించిన చెయ్యికాని గుండెకాని మనసు కాని మరొటిలేదు. బ్రిటిష్ ప్రభువులతో పోరాటం సాగిస్తున్నప్పటికే వార్ని ఆయన ఎంతగా ప్రేమించేవారో నేను వర్ణించి చెప్పలేను. అది లవ్ అఫ్ ది హయెస్ట్ ఆర్డర్ అన్నమాట. ఇంగ్లీషువార్ని ప్రేమించలేనివార్ని చంపేదాం అన్నంతకోపం ఆయన కోసారి రావడం నాకు బాగా తెలుసు.

ఓసారి, మా నాయనగారు — సబ్ డివిజనల్ మేజిస్ట్రేటు హోదాలో — జాతీయ స్వాతంత్ర్య పోరాటంగాళ్ళ మీద కాల్పులు జరిపించవలసి వచ్చింది. అప్పుడు నలుగురైదుగురు చావల్ ఖరాబీ పోరాటగాళ్లు కాటోలు చచ్చేరు..

అది జరిగిన తరవాత మా నాయనగారు మా రాజయోగిపెదనాయనగార్ని చూడ్డానికి చాలా మోహమాట పడ్డారు. "దేశభక్తుల్ని" షూట్ చేయించినందుకు తనని ఆయన సూటిపోటి మాటలాడతారేమోనని మా నాయనగారు చాలా భయపడ్డారు. కాని, వారు ఇంటికి వచ్చినప్పుడు వార్ని కలియకపోవడం ఎలా కుదురుతుంది!

కాని, ఆ ఫైరింగ్ విషయం గురించి మా రాజయోగిపెదనాయనగారు మా నాయనగార్ని పల్లెత్తు చెడుమాటైనా అనలేదంటే నమ్మండి! "నీ డ్యూటి నువ్వు చేసేవు! దాని కేం వుంది? డ్యూటి ఈజ్ డ్యూటి!" అన్నారాయన.

"మీకు నా మీద కోపంకాని ద్వేషం కాని నిజంగా ఏమీ లేదా అన్నగారూ?" అని మా నాయనగారు వార్ని అడిగేరు.

అందుకు మా రాజయోగిపెదనాయన గారి సమాధానం మరుపురానిది?

"శత్రువునే ప్రేమించగలిగిన వాణ్ని — కావలసినవాడివి కదా — నిన్ను ద్వేషిస్తానా?" అన్నారు వారు వారి ఆదరణకీ అభిమానానికీ ప్రేమకీ కరిగిపోయిన మానాయనగారు ఆ సమయంలో ఆనందబాష్పాలు రాల్చడం నాకు ఇప్పటికీ ఎంతో బాగా గుర్తుంది. మా రాజయోగి పెదనాయనగారు సచ్చీలురూ శాంతమూర్తులూ అని ఎన్ని సార్లు చెప్పినా నాకు తనివి తీరదు.




నేనూ నా సర్వెంట్ గో. దాసుగాడూ కలిసి సువర్ణసుందరపురానికి బయల్దేరేం అని చెప్పేనుకదా. సాయంకాలం పాసెంజర్ ఎక్కి రాత్రల్లా ప్రయాణం చేసి, ఆవూరి స్టేషన్లో నేను దిగేసరికి ఉదయం ఆరుగంట లయింది.

స్టేషన్లో జనం ఆట్టే లేరు. ఈ రోజుల్లోలాగ అప్పుడు దొమ్మిగా ఉండేది కాదు. (బర్త్‌కంట్రోల్ లేకపోతే మరి కొన్నాళ్ళకి ట్రెయిను ప్రయాణా లుండవు. అంగుళానికో మనిషిచొప్పున నిల్చుంటే మరింక ట్రెయిన్లకీ కార్లకీ చోటెక్కడుంటుంది?) ఉదయం ఆరు గంటలకి నిద్రలోంచి లేచినట్టు స్టేషన్ లో అంతా బరువుగా బద్ధకంగా కదుల్తున్నారు. స్టేషన్లో భారీ చెట్లున్నాయి. అవి వెలుగుకోసం వెయిట్ చేస్తున్నాయి. తూర్పుదిక్కు ఎర్రనయింది. ప్రకృతి అంతా చాలా బ్యూటిఫుల్‌గా ఉన్నట్టు నాకు ఇప్పటికీ బాగా గుర్తుంది. ఎక్కడో ఓ కోయిల పాడితే, మరో కోయిల జవాబుపాట పాడినట్టుగా కూడా నాకు గుర్తుంది. పక్కరాజ్యానికి వచ్చిన మిత్ర రాజ్యపు యువరాజుని ఆహ్వానించినట్టు ప్రకృతిఅంతా సన్నారోజున ఆహ్వానించిం దనుకుంటాను.

స్టేషన్‌కి పాసింజెరు చేరుకోకముందే నేను ట్రెయిన్లో శుభ్రంగా స్నానం చేసి దుస్తులు మార్చుకొని స్మార్ట్‌గా టిప్ టాప్‌గా తయారయేను. నేను ట్రెయిన్

దిగి నిల్చుంటే గోదాసుగాడు నా సామాన్లు కిందికి దించేడు. కిటికీల్లోంచి జనం నన్ను తొంగి తొంగి చూస్తూండగా ట్రెయిను కదిలివెళ్ళింది. నేను ట్రెయిన్ని కేర్ చెయ్యకుండా నిల్చున్నాను.

నా బ్లాక్ షూస్కింద ప్లాట్ఫాంమీది ఎర్రకంకర — మంచులో తడియడంవల్ల — మెత్త మెత్తగా కరకర మంటోంది. తెల్లటి వులెన్ స్టాకింగ్స్ నా కాళ్ళని మెత్తగా అంటిపెట్టుకున్నాయి తెల్లగా మెరిసే నిక్కర్లో తెల్లని సిల్కు చొక్కా టక్ చేసుకొని అందుమీద బ్లూ బ్లేజర్కోటు తొడుక్కున్నా న్నేను. ఎడంచేత్తో కోటుఫ్లాపు పట్టుకున్నప్పుడు దాని రోల్డుగోల్డు బొత్తా నా చేతికి నున్నగానూ చల్లగానూ తగుల్తోంది. నా కుడి చేతిలో బ్లూబాండ్గల తెల్లటి హాట్ ఒక టుంది. ప్లాట్ఫాంమీద అక్కడొక రాయి ఉంటే, దానిమీద నా ఎడంకాలు మోపి, భూప్రపంచాన్నంతా కాలికింద వేసి నిల్చున్నట్టు నేను ప్రిన్స్లీగా నిల్చొనిఉండగా, నావైపే చూస్తూ ఓ ఖద్దరువాలా నావైపే వచ్చేడు. వాణ్ని బాగా దగ్గిరగా రానిచ్చి, వాణ్నోసారి సూటిగా ఆపాదమస్తకం చూసి, బీట్రూట్ కొరుక్కుతున్నవాడు బెండకాయల్నించి ముఖం తిప్పుకున్నట్టు ముఖం తిప్పేసుకున్నా న్నేను. కెనెడీగారికంటె ఎక్కువ స్టయిల్ నాకు చిన్నప్పుడే ఉండేది!

గాడిదరంగు ఖద్దరుపంచె కట్టుకొని అదేరంగు ఖద్దరులాల్చీ తొడుక్కొని తెల్లా ఎర్రగానూ పాములా సన్నంగానూ ఉన్నాడు వాడు. వాడికి అప్పటికి ఓ పాతికేళ్ళ వయసు ఉంటుం దనుకుంటాను. కాని, ఆరోజున వాడు నాకు చాలా పెద్దవాళ్ళా (అంటే వయసులో పెద్దవాళ్ళా) కనిపించేడు. వాడిపేరు సత్యమూర్తని ఆ తరవాత తెలిసింది నాకు.


"ఏం బ్బాయ్? నువ్వేనా యోగ్గారి ఆశ్రమానికి వచ్చేది?" అని వాడు నన్నడిగేడు.

నేను ఆ సత్యమూర్తిగాడివైపు అప్పుడు ముఖం తిప్పి వాణ్ణి కొరకొరలాడుతూ కొంతసేపు చూసేను. వాడు నన్ను మర్యాదగా 'మీరు' అనకుండా నన్ను 'నువ్వు' చెయ్యడంవల్ల వాడంటే నాకు చాలా కోపం వచ్చింది. బురద రంగు ఖద్దరుబట్టలు వేసుకొని బుర్రతిరుగుడుగా కేకలు వేసుకొంటూ తిరిగే పోరాటంగాళ్ళు ఆరోజుల్లో (ఆ సత్యమూర్తిగాళ్లాంటి వాళ్ళు) చాలామంది ఉండేవారు వాళ్ళని తల్చుకొంటేనే నాకు అసహ్యం వేస్తుంది.

వాడిప్రశ్నకి సమాధానంగా "యస్" అని కర్ట్గా అన్నా న్నేను.

"యోగ్గారు నీకోసం బగ్గీ పంపించేరు", అన్నాడు వాడు.

"బాబుగోరి కారు డివైయ్యస్పీబాబు




రొండ్రోజులు అరువొట్టికెళ్ళాడు అంచేత బగ్గీ పంపించినారు బాబుగోరు!" అని కారు రానందుకు సంజాయిషీ చెప్పుకుంటూ సత్యమూర్తిగాడి వెనకనే మరొకడు వచ్చి నా ఎదర నిల్చున్నాడు.

వాడికి పసుప్పచ్చ కుచ్చుపాగా ఉంది, తెల్లటి మల్లుపంచె ఉంది, రాగిరంగు మీసం ఉంది, పండిన బాదంపళ్ళల్లా ఎర్రటి కళ్ళున్నాయి, మూడు చదరపు గజాల ముఖం ఉంది. ఆరడుగులకంటె హెచ్చు పొడవుగా ఉంది, కొండగుహలో చెక్కిన దండుమనిషిబొమ్మలా ఉన్నాడు వాడు. వాడు బ్రహ్మరాక్షసుళ్ళా ఉన్నప్పటికీ వాణ్ని చూస్తే నా కెందుకోగాని ఇష్టం అయింది.

చూసీ చూడగానే నా జీవితపు లోతుపాతులన్నీ తెలుసుకున్నవాళ్ళా వాడు నన్ను చూసి చిరునవ్వు నవ్వేడు. వాడు దొంగలా ఉండడంబట్టి కాబోలు — దొంగల నాయకుడి కొడుకుని చూసి దొంగ మెచ్చుకున్నట్టుగా ఉంది వాడి నవ్వు. కాని, వాణ్ణి చూస్తే నాకు ఇష్టమే అయింది.

"అంచేత బగ్గీలో ఎళ్దాం రా బాబూ రా! పాండ్రంగబాబు కొడుకువా, అయితే? సూడగానే అనుకున్నాన్లే, పులికడుపున మేక పుడతదా, పులే పుడద్ది గాని!?", అంటూ వాడు నన్ను, దూర దేశంనించి వచ్చిన దగ్గరబంధువుని పలకరించినట్టు ఆప్యాయంగా పలకరించేడు.

సత్యమూర్తిగాడికీ నాకూ తొలిచూపులోని ద్వేషానికీ, ఈ బ్రహ్మరాక్షసుడికీ నాకూ తొలిచూపులోని అనురాగానికీ కారణం నేను సరిగా చెప్పలేను. అదొక రకం కులద్వేషం, కులాభిమానంలాంటిదని అనుకుంటాను.

ఆ కుచ్చు పాగావాడు "నా పేరు ప్రెబుదాసు బాబూ! నాన్నగోర్నడగండి నా బోగట్టా అంతా సెప్తారు. నాన్న బలే జల్సామనిసి!", అంటూ చెప్తూ వాడు నా గోదాసుడుగాణ్ని చూసి, ఏరా సత్తరకాయ్, నువ్వు మా బాబుతోటే నేంటి ఒచ్చినావు? మరైతే అలా నిలబడి పోనావేటి? సామాన్లొట్టుకో!", అంటూ పనిలోకి దిగేడు.

సత్యమూర్తిగాడు ఏమీ మాట్లాడ లేదు. కొరకొరలాడుతూ నిల్చున్నాడు. వాడి చూపులు రాళ్ళవర్షంలా ఉన్న ట్టనిపిస్తే ప్రభుదాసుడి అండ నాకు కొండలా ఉన్న ట్టనిపించింది.

నా ఫ్లాస్కు పట్టుకొని ప్రభుదాసు నాతోపాటు నడుస్తూండగా, నా పెట్టే బెడ్డింగూ అవీ మోసుకొని గోదాసుడు నా వెనక నడుస్తున్నాడు. సత్యమూర్తిగాడు గోదాసుడితోపాటు వస్తున్నాడు. ప్లాట్ఫాం కొసనించి స్టేషన్ బిల్డింగుకి చాలాదూరం ఉంది. పదడుగులదూరం నడిచేమో లేదో ప్రభుదాసు నాతో, కొంచెం నెమ్మదిగా—

"ఎనక నొస్తున్నాడు, ఆణ్ని జూసినావా?" అన్నాడు.

సత్యమూర్తిగాడి గురించే ప్రభుదాసు చెప్తున్నాడని గ్రహించగలిగేను.

"ఏం?" అని నేను (కూడా) నెమ్మదిగా అడిగేను.

"ఆడు గొప్ప డేంజరు మనిషి," అన్నాడు ప్రభుదాసు.

ఆ డేంజరస్ మనిషివైపు కొంచెం వెనక్కి తిరిగిచూసేను. వాడు మా గోపాలదాసుడుగాడితో ఆప్యాయంగా మాట్లాడుతూ వస్తున్నాడు.

"మన బాబ్గోరు ఖద్దరుమనిసైపోయినాక, ఉత్తరాలు బక్కీరడానికన్జెప్పి ఈణ్ని లాకొచ్చి గెంజినీళ్ళోస్తుంటే, ఈడికిప్పుడు కండకావరం లావైపోయినాది. కళ్ళు నెత్తికెళ్ళాయి," అన్నాడు ప్రభుదాసు.

సత్యమూర్తిగాణ్ని తలుచుకొంటే నాకు అసహ్యం వేసింది.

"అంతేకాదు! ఆడు గొప్ప గాతుకుడు!" అని ఖచ్చితంగా చెప్పేడు ప్రభుదాసు.

"అంటే ఏమిటి?" అని నేనడిగేను. "గాతుకుడు" అంటే సుగ్రంలాంటివాడో గాడిదలాంటివాడో అని నేననుకున్నాను.

(సశేషం)